andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.7 : కనిష్ఠం 24.8

నిర్మల్
జిల్లా వార్తలు
8
గురువారం 17 అక్టోబరు 2024

శబరిమలకు అయ్యప్ప మాలధారుల పాదయాత్ర


భైంసా, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) శబరిమల అయ్యప్పస్వామి దర్శనం కోసం గాను డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల నుంచి అయ్యప్ప దీక్షాపరులు బుధవారం పాదయాత్రను ప్రారంభించారు. ఉదయమే మాలాధారణ చేసి, దీక్షను స్వీకరించి స్వాములు అనంతరం తమ గ్రామంలోని ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించి పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. భైంసా మండలంలోని వానల్‌పాడ్ గ్రామం నుంచి రామ్ పాటిల్, కుభీర్ మండలంలోని బెల్గాం గ్రామం నుంచి బాలానంద్, లక్ష్మణ్, పండరి (చికిలి)లు పాదయాత్రను చేపట్టారు. దీక్షాపరులకు కుటుంబ సభ్యులు, బంధు,మిత్రులు, గ్రామసులు తమ తమ గ్రామ పొలిమేరల వరకు పాదయాత్రగా తరలి వెళ్లి సాగనంపారు.

తాగునీటి అవస్థలకు చెక్



- ఇక పల్లెల్లో విలేజ్ వాటర్ అసిస్టెంట్‌లు..
- కొనసాగుతున్న శిక్షణ
- కొత్త విధానానికి సర్కారు చర్యలు
- పంచాయతీ ఎంపీడబ్ల్యులలో ఊరికి ఒకరికి ఛాన్స్
- నాలుగు అంశాలపై ప్రధాన శిక్షణ
- మిషన్ భగీరథ శాఖకు అనుసంధానం

నిర్మల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ మంచినీటి సరఫరా విభాగంలో ఇకపై కొత్తగా మంచినీటి సహాయకులు (విలేజ్ వాటర్ అసిస్టెంట్లు) వస్తున్నారు. అస్తవ్యస్థంగా ఉన్న గ్రామీణ తాగునీటి వ్యవస్థలో ఉన్న లోపాలను గుర్తించిన ప్రభుత్వం శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నది. పంచాయతీలలో తాగునీటి వ్యవస్థపై ఇప్పటిదాక ఎవరికీ పూర్తిస్థాయిలో బాధ్యతలు లేని కారణంగా తాగునీటి సరఫరా విధానం ప్రశ్నార్థకంగా ఉండేది. దీన్ని పూర్తిస్థాయిలో పరిష్కారం కోసం ప్రభుత్వం కొత్తగా విలేజ్ వాటర్ అసిస్టెంట్‌లను నియమించింది. ఇప్పటికే గ్రామ పంచాయతీలలో మల్టీపర్పస్ వర్కర్లు (ఎంపీడబ్ల్యు)గా పనిచేస్తున్న వారిలో పంచాయతీకి ఒకరు చొప్పున చురుకైన అభ్యర్థిని ఎంపిక చేసి వారిని ఒకపై విలేజ్ వాటర్ అసిస్టెంట్‌గా నియమించనున్నారు. వారికి కీలక శిక్షణను అందజేస్తున్నారు. కొన్ని మండలాల్లో ఇప్పటికే శిక్షణ పూర్తి చేశారు. శిక్షణ అనంతరం గ్రామీణ మంచినీటి నిర్వహణ పూర్తిగా విలేజ్ వాటర్ అసిస్టెంట్లకు అప్పజెప్పనున్నారు. విధుల్లో చేరిన తరువాత ఇకపై విలేజ్ వాటర్ అసిస్టెంట్లు గతంలో ఉన్న ఆర్‌డబ్ల్యుఎస్ (మిషన్ భగీరథ) శాఖకు అనుసంధానంగా పని చేయనున్నారు.



నాలుగు అంశాలపై వీరికి శిక్షణ

ప్రతి గ్రామ పంచాయతీకి ఒక విలేజ్ వాటర్ అసిస్టెంట్‌ను ప్రభుత్వం ఎంపిక చేసింది. వారికి కీలకమైన నాలుగు అంశాలపై శిక్షణ అందజేస్తున్నారు. ప్రతి రెండు నుంచి మూడు మండలాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి ఆ క్లస్టర్‌లో పనిచేసే అసిస్టెంట్ ఇంజనీర్ ఆధ్వర్యంలో వీరు గ్రామీణ మంచినీటి నిర్వహణ చేపట్టనున్నారు. ముఖ్యంగా గ్రామీణ తాగునీటి సరఫరా విధానం అస్తవ్యస్థంగా ఉన్న నేపథ్యంలో దాన్ని గాడిన పెట్టే ఉద్దేశంతో ఈ కొత్త విధానాన్ని అమలు చేస్తున్నట్లు మిషన్ భగీరథ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. తాజాగా వస్తున్న విలేజ్ వాటర్ అసిస్టెంట్ల నియామకంతో గ్రామాల్లో తాగునీటి వ్యవస్థ మెరుగుపడుతుందని ఆ అధికారి చెప్పారు. మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ నుంచి ఇంట్రా విలేజ్ పైప్‌లైన్ అనుసంధానంపై మొదటి అంశం కింద శిక్షణ ఇస్తున్నారు. రెండో అంశం కింద ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకుల్లో తాగునీటి క్లోరినేషన్ విధానంపై శిక్షణ అందజేస్తున్నారు. అలాగే వన్‌హెచ్‌పీ మోటార్ రిపేర్‌తో పాటు హ్యాండ్‌పంప్ (బోర్‌వెల్) నిర్వహణ మరమ్మతులపై వీరికి శిక్షణ ఇస్తున్నారు. జిల్లాలో 396 గ్రామ పంచాయతీలు ఉండగా 410 మంది విలేజ్ వాటర్ అసిస్టెంట్లను ఎంపిక చేసి క్లస్టర్‌ల వారీగా శిక్షణ ప్రారంభించారు. ఈ నెలాఖరుకు అన్ని గ్రామ పంచాయతీల విలేజ్ వాటర్ అసిస్టెంట్‌లకు శిక్షణ పూర్తి చేయనున్నారు. శిక్షణ అనంతరం గ్రామీణ మంచినీటి / తాగునీటి సరఫరా విభాగం మొత్తాన్ని వారికి అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

మిషన్ భగీరథకు సిబ్బంది అటాచ్

శిక్షణ పొందిన అనంతరం విలేజ్ వాటర్ అసిస్టెంట్‌లను గ్రామీణ నీటి సరఫరా విభాగం మిషన్ భగీరథకు అనుసంధానం చేయనున్నారు. ఇప్పటి దాక గ్రామ పంచాయతీ పరిధిలో పని చేసిన ఎంపీడబ్ల్యులలో పంచాయతీకి ఒకరు చొప్పున శిక్షణ ఇస్తున్న వారిని ఇకపై విలేజ్ వాటర్ అసిస్టెంట్లుగా పరిగణించనున్నారు. త్వరలోనే వీరి శిక్షణ పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. శిక్షణ అనంతరం వీరు మిషన్ భగీరథ అసిస్టెంట్ ఇంజనీర్లు, జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పరిధిలోకి వెళతారు. వీరిపై పర్యవేక్షణ కూడా మిషన్ భగీరథ శాఖనే చేయనున్నది.

పారిశుధ్యంపై ప్రభావం చూపే అవకాశం

గ్రామ పంచాయతీలలో ప్రస్తుతం పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్ల నుంచి ప్రతీ గ్రామపంచాయతీలో ఒకరిని ఎంపిక చేసి విలేజ్ వాటర్ అసిస్టెంట్‌లుగా నియమిస్తున్న కారణంగా పంచాయతీలలో పారిశుధ్యంపై ప్రభావం చూపే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా సర్కారు నిర్ణయంతో ప్రతీ పంచాయతీకి ఒకరు చొప్పున మల్టీపర్పస్ వర్కర్స్ తగ్గిపోనున్నారు. అయితే వీరిస్థానంలో కొత్తగా మల్టీపర్పస్ వర్కర్లను నియమించే అవకాశం ఉందని కూడా అధికార వర్గాలు వెల్లడించాయి. అయితే వెంటనే ఖాళీ అయ్యే ఎంపీడబ్ల్యూ స్థానాలను భర్తీ చేయాలని పంచాయతీ వర్కర్స్ యూనియన్ కోరింది.

విద్యుదాఘాతంతో
అసిస్టెంట్ లైన్‌మెన్‌కు తీవ్రగాయాలు

భైంసా, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) పట్టణ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ గృహ సముదాయ ప్రాంతంలో బుధవారం ట్రాన్స్‌కో అసిస్టెంట్ లైన్‌మెన్ ఒకరు విద్యుదాఘాతం బారిన పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. ట్రాన్స్‌కో అధికారులు తెలిపిన కథనం ప్రకారం ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక సబ్‌స్టేషన్‌లో అసిస్టెంట్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న పి. జైపాల్ (42) సాయంత్రం వేళలో సర్వీస్ వైరు సమస్య పరిష్కారం మరమ్మతు చేపట్టారు. సంబంధిత ఫీడర్ లైన్ క్లియర్ (ఎల్‌సీ) తీసుకొని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సర్వీస్ వైరు మార్పే పనులను నిర్వహించాడు. ఈ సందర్భంలో సంబంధిత ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వెలుతున్న మరో విద్యుత్ లైన్‌కు ఏఎల్‌ఎం జైపాల్ తగలడంతో విద్యుదాఘాతం బారిన పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. విద్యుత్ ప్రమాదానికి గురైన ఏఎల్‌ఎం జైపాల్‌ను తోటి ఉద్యోగులు హుటాహుటిన ఇక్కడి ఏరియా ఆసుపత్రికి తరలించారు. స్థానికంగా ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్య సేవల కోసం గాను నిజామాబాద్‌కు తరలించారు. క్షతగాత్రుడిని ఏరియా ఆసుపత్రిలో ట్రాన్స్‌కో భైంసా డీఈ శ్రీనివాస్ రెడ్డి, ఏడీఈ అధిత్య, ఏఈ మోహన్‌కుమార్‌లు పరామర్శించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు.


తీవ్రంగా గాయపడ్డ జైపాల్

గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేసిన డీఎల్‌పీవో


సిర్గాపూర్ గ్రామ పంచాయతీ రికార్డులు తనిఖీ చేస్తున్న దృశ్యం

దిలావర్‌పూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిర్గాపూర్ గ్రామ పంచాయతీ రికార్డులను గురువారం డీఎల్‌పీవో రమేష్ తనిఖీ చేశారు. ఎప్పటికప్పుడు రికార్డులను అప్డేట్‌గా ఉంచాలని సూచించారు. అనంతరం నర్సరీ సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. గ్రామంలో పారిశుధ్యం సక్రమంగా నిర్వహించాలన్నారు. డీఎల్‌పీవో వెంట ఎంపీవో గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి నాగేష్ ఉన్నారు.

ప్రజాగళం సభకు హైకోర్టు అనుమతి

- సంబరాలు చేసుకున్న రైతులు
- రేపు బహిరంగసభ


సభ నిర్వహణకు హైకోర్టు అనుమతించడంతో దీక్ష శిబిరం వద్ద సంబరాలు చేసుకుంటున్న రైతులు

దిలావర్‌పూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : దిలావర్‌పూర్‌లో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా నిర్వహించ తలపెట్టిన ప్రజాగళం బహిరంగ సభకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. నిజానికి బుధవారమే నిర్వహించాల్సి ఉన్న ప్రజాగళం బహిరంగ సభకు ఇథనాల్ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. పోలీసులు అనుమతి ఇచ్చినట్లే ఇచ్చి రద్దు చేశారు. పోలీస్ 30 యాక్ట్ అమలులో ఉన్నందున బహిరంగసభ నిర్వహణకు అనుమతించలేమని నిరాకరించారు. వెంటనే ఇథనాల్ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు హైకోర్టు మెట్లెక్కారు. ప్రజాగళం బహిరంగ సభ నిర్వహణకు అనుమతించాలని కోరుతూ పిటిషన్ వేశారు. బుధవారం పిటిషన్‌ను పరిశీలించిన హైకోర్టు షరతులతో కూడిన అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 18వ తేదీన ప్రజాగళం బహిరంగసభ నిర్వహించేందుకు ఇథనాల్ వ్యతిరేక పోరాట కమిటీ నిర్ణయించింది. భారీ జన సమీకరణకు సిద్ధమైంది. ఈ బహిరంగసభలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్, అంబటి నాగయ్య, కన్నెగంటి రవి, కొండల్‌రెడ్డి, ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక కన్వీనర్ మీరా సంఘ మిత్ర, చిత్తనూర్ ఇథనాల్ పరిశ్రమ వ్యతిరేక పోరాట కమిటీ నాయకుడు బండారి లక్ష్మయ్య, ఇంకా పలువురు ప్రజా సంఘాల నాయకులు పాల్గొననున్నట్లు ఇథనాల్ పరిశ్రమ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు తెలిపారు.

సంబరాలు చేసుకున్న రైతులు...

ప్రజాగళం బహిరంగసభకు హైకోర్టు అనుమతినివ్వడంతో దిలావర్‌పూర్‌లో రైతులు దీక్ష శిబిరం వద్ద సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంచారు. ప్రజాగళం బహిరంగసభ నిర్వహణకు పోలీసులు నిరాకరించినా హైకోర్టు అనుమతించడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

పత్తి కొనుగోళ్లకు పకడ్బందీ చర్యలు

- కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్


హాజరైన అధికారులు

నిర్మల్ అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పత్తి కొనుగోళ్లకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పత్తి కొనుగోళ్లపై సంబంధిత శాఖల అధికారులు, రైతులు, ట్రేడర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా పత్తి కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నవంబరు మొదటి వారంలో పత్తి కొనుగోళ్లను ప్రారంభించనున్న నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో 1 లక్ష 47 వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేయగా సుమారుగా 10 లక్షల క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. పత్తి కొనుగోళ్ల ప్రారంభానికి ముందే జిన్నింగ్ మిల్లులలో అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. సీసీఐ ద్వారా పత్తి పంటకు కనీస మద్దతు ధర రూ. 7,521 నిర్ణయించడం జరిగిందన్నారు. రైతులు తాము పండించిన పత్తిని 8 శాతం తేమ మించకుండా నాణ్యత ప్రమాణాలు పాటించి మద్దతు ధర పొందాలని కోరారు. రైతు పండించిన పత్తి పంటకు ఖచ్చితంగా ఆధార్ నెంబర్ కలిగి ఉన్నట్లు రుజువు సమర్పించాలన్నారు. పత్తి కొనుగోళ్లకు రైతుల ఆధార్ ప్రామాణికమని, రైతులందరూ తమ బ్యాంక్ ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకునే విధంగా వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో 7 అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడం జరిగిందని, పోలీస్, వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి పత్తి మిల్లులలో ముందస్తు తూకం యంత్రాల పని తీరును పరిశీలించుకోవాలని, అగ్ని ప్రమాదాలు జరుగకుండా అగ్నిమాపకశాఖ తనిఖీలు చేయాలని సూచించారు. పోలీస్, రవాణా అధికారులు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా జిన్నింగు మిల్లుల వద్ద తగు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు తాగునీరు వంటి సదుపాయాలు కల్పించాలని సూచించారు. అనంతరం ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి కలెక్టర్ పలు సూచనలు చేశారు. ధాన్యం కొనుగోళ్లకు జిల్లాలో 272 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దొడ్డు, సన్నరకం ధాన్యానికి వేరువేరుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు.

ఇప్పటికే 20 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగిందని, కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, గన్ని బ్యాగులు, టార్పాలిన్ అందుబాటులో ఉంచాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. ఈ నెల 25 వరకు కొనుగోలు కేంద్రాలన్నింటినీ ప్రారంభించాలని ఆదేశించారు. అంతకుముందు మార్కెటింగ్ శాఖ కరపత్రాలను జిల్లా కలెక్టర్ అధికారులు, ట్రేడర్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, డీఎస్‌వో కిరణ్ కుమార్, డీఎం వేణుగోపాల్, సీసీఐ ప్రతినిధులు, రవాణా, పోలీసుశాఖల అధికారులు, ట్రేడర్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సోయా దిగుబడులు నీళ్లపాలు

- సోయా సంచులతో వాగులో బోల్తా పడ్డ ట్రాక్టర్
- బ్రిడ్జి లేక తిప్పలు



ముథోల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మండల కేంద్రంలో వ్యవసాయ పొలాలకు వెళ్లే కర్వాల దారిలో గల వాగులో సోయా సంచుల ట్రాక్టర్ బోల్తా పడటంతో సుమారు రూ.లక్షన్నర వరకు రైతు నష్టపోయిన సంఘటన ముథోల్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం శామొల్ల సాయినాథ్ అనే రైతు తన పొలంలో కోసిన సోయా పంటను ట్రాక్టర్‌తోని ఇంటికి తెచ్చే క్రమంలో మార్గమధ్యంలో వాగులో ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడి సుమారు 35 క్వింటాళ్ల సోయా సంచులు వాగులో పడి తడిసి పోయాయి. సుమారు 20 సంచుల వరకు సోయా నీటిలో కొట్టుకుపోయింది. సుమారు రూ. లక్షన్నర వరకు నష్టం వాటిల్లింది. పండించిన పంట నీళ్లపాలు కావడంతో రైతు కుటుంబీకులు కన్నీరు మున్నీరయ్యారు. దారిన వెళ్లే తోటి రైతులు జేసీబీ సహాయంతో తడిసిన సోయా సంచులు, ట్రాక్టర్‌ను బయటకు తీశారు. పంట నష్టం ప్రభుత్వం నుంచి సహాయం ఇవ్వాలని కోరారు. గతంలో కూడా గేడెల కాపరి వాగు దాటబోయి ఇక్కడే నీటమునిగి ప్రాణాలు కోల్పోయాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వాగుపై వంతెన నిర్మించాలని రైతులు వేడుకుంటున్నారు.

కొలువుదీరిన నిర్మల్ వ్యవసాయ కమిటీ నూతన పాలకవర్గం

- అట్టహాసంగా ప్రమాణ స్వీకారోత్సవం
- చైర్మన్‌గా సోమ భీమ్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ


చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న భీమ్‌రెడ్డి


చైర్మన్‌ను సన్మానిస్తున్న పలువురు

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గం బుధవారం అట్టహాసంగా కొలువుదీరింది. చైర్మన్‌గా మేడిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సోమ భీమ్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. వైస్ చైర్మన్‌గా ఈటెల శ్రీనివాస్‌తో పాటు నియమితులైన డైరెక్టర్లతో వ్యవసాయ శాఖ అధికారి వారితో పదవీ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నాందేడపు చిన్ను, ఏనుగు లింగారెడ్డి, రామ్‌రెడ్డి, రమేష్, కొట్టే శేఖర్, తదితరులు పాల్గొన్నారు. నూతన చైర్మన్‌ను సన్మానించారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి: చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి

నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని చైర్మన్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం భీమ్‌రెడ్డి అన్నారు. తనపై నమ్మకంతో చైర్మన్‌గా అవకాశం కల్పిస్తూ నియమించిన సీఎం రేవంత్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరి రావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు న్యాయం చేస్తానని స్పష్టం చేశారు.

సంక్షిప్త సమాచారం

మూడు కొత్త
పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలు

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ నియోజకవర్గం పెంబి మండలంలో కొత్తగా మూడు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. బుధవారం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. రాంనగర్, బూరుగుపల్లి, వస్‌పల్లి మండల పరిషత్ పాఠశాలలున్నాయని తెలిపారు.

విగ్రహం ధ్వంసం చేసిన
వారిపై చర్య తీసుకోవాలి

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల వరంగల్‌లోని దేశాయిపేట కూడలిలో మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులపై చర్య తీసుకోవాలని జిల్లా బీఎస్పీ ఇంచార్జి డి. జగన్మోహన్ డిమాండ్ చేశారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య


అరవింద్ (ఫైల్)

కుంటాల, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల పంచాయతీ పరిధిలో గల సేవాలాల్ తాండాకు చెందిన చవాన్ అరవింద్ (28) అనే యువకుడు బుధవారం ఉదయం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు కుంటాల ఏఎస్సై దేవురావు తెలిపారు. కుటుంబీకులు, పోలీసుల కథనం మేరకు అరవింద్ గత కొద్ది రోజుల నుంచి పనిపాట లేకుండా మద్యానికి బానిసై తిరుగుతుండే వాడని ప్రతీరోజు మాదిరిగానే మంగళవారం రాత్రి ఇంటి బయట రాత్రి వేళలో పడుకున్న కుమారుడు బుధవారం ఉదయం పడుకున్న చోట లేకపోవడంతో అతని తండ్రి మారుతి కొడుకు కొరకు ఇంట్లో గాలించగా ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలిపారు. మృతుని భార్య ఇందుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గుండెగాం
సమస్యలు పరిష్కరించాలి

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : భైంసా మండలం గుండెగాం గ్రామ ప్రజలు ఎదుర్కొనే సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో గ్రామస్థులు కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ప్రతి వర్షాకాలంలో రైతులు, వ్యవసాయ కార్మికులు ప్రజలు పంటలు, ఆస్తులు, ఇళ్లు కోల్పోయి నష్టపోతున్నారని తెలియజేసినా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలకు తక్షణం పునరావాస సౌకర్యం కల్పించాలని కోరారు. పల్సికర్ రంగారావు ప్రాజెక్టు ముంపు బాధితులను ఆదుకోవాలని, 470 కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వ పథకాలు అమలు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి విలాస్, కార్యవర్గ సభ్యుడు భూక్యా రమేష్, ఎస్‌ఎన్‌రెడ్డి, ఉపాలి, మల్కయ్య, దేవిదాస్, భూమయ్య, తదితర నాయకులు పాల్గొన్నారు.

ముక్రా(కే)లో 30 మందిపై అట్రాసిటీ కేసు నమోదు

ఇచ్చోడ, అక్టోబరు, 16(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండలంలోని ముక్రా(కే) గ్రామానికి చెందిన 30 మందిపై అట్రాసిటీ కేసు నమోదైనట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముక్రా(కె) గ్రామానికి చెందిన దళిత వర్గం, ఆర్యామరాఠ కులాల మధ్య మంగళ వారం రాత్రి ఘర్షణ నెలకొంది. దళిత వర్గానికి చెందిన వారు బుధవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనపై విచారణ జరిపిన పోలీసులు 30 మందిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

దేవాలయాల రక్షణ బాధ్యత ప్రభుత్వానిదే : బీజేపీ

ఉట్నూర్, అక్టోబరు 16: తెలంగాణ రాష్ట్రంలోని దేవాలయాల రక్షణ బాధ్యత ప్రభుత్వానిదేనని బీజేపీ జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందూ దేవాలయాలపై జరిగే దాడులకు ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. గతంలో దిలుసుక్‌నగర్ సాయిబాబా ఆలయంపై దాడి జరిగినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే తమ ఆలయాలను తామే కాపాడుకుం టామన్నారు. సమావేశంలో జగన్‌నాయక్, సీపతిలింగాగౌడ్, శ్రీరామ్ నాయక్, రాజశేఖర్, బింగి వెంకటేశ్, సాడిగే రాజేశ్వర్ పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలి

నేరడిగొండ, అక్టోబరు16: పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని పశువైద్యాధికారి రాథోడ్‌జీవన్ అన్నారు. బుధ వారం మండలంలోని తేజాపూర్ వాంకిడి గ్రామాలలో 837 పశువులకు ఉచిత టీకాలు అందించడం జరిగిందన్నారు. సీజనల్ వ్యాధుల భారీన పడకుండా జీవాలు ఉండాలంటే గాలికుంటు వ్యాధి టీకాలను తప్పకుండా వేయించుకోవాలన్నారు. ఇందులో పశువైద్యాధికారి సుశీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక మొక్కను రక్షించాలి : ఎంపీడీవో రాజ్‌వీర్

నేరడిగొండ, అక్టోబరు 16: హారితహారం పథకంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. బుధవారం మం డలంలోని కుంటాల రహదారి వెంట నాటిన మొక్కలకు ట్యాంకర్ ద్వారా నీరు పోయించారు. ఉపాధిహామీ పథకంలో ప్రతి గ్రామంలో నాటిన మొక్కను సిబ్బంది సంరక్షించేలా చూడాలన్నారు. గ్రామ పంచాయతీల్లో ట్యాంకరు ఉందని, దాని ద్వారా మొక్కలకు నీరు పోయాలన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎంపీపీ

బోథ్, అక్టోబరు 16 : పిప్పలదరి గ్రామ మాజీసర్పంచ్ శ్రీధర్‌రెడ్డి పెద్దమ్మ ఇటీవల మృతిచెందడంతో బుధవారం మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పిప్పలదరి గ్రామానికి వెళ్లి ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆమె మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బి.శ్రీనివాస్, నల్ల కొండ ప్రశాంత్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

తలమడుగు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన ఠాకూర్ కిష్టన్న (47) అనే వ్యక్తి 20 రోజుల నుంచి కనిపించడం లేదని కుటుంబసభ్యులు తలమడుగు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు మాట్లాడుతూ తలమడుగు గ్రామానికి చెందిన ఠాకూర్ కిష్టన్న 20 రోజుల క్రితం ఊరికి వెళ్తానని వెళ్లి ఇప్పటి వరకు రాలేదన్నారు. ఈ విషయమై కుటుంబసభ్యులతో బంధువులతో సంప్రదించడం జరిగిందన్నారు. కాగా తమ్ముడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజమ్మ తెలిపారు.

ప్రైవేట్ డిగ్రీ కళాశాలల ధర్నా

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి) : ఫీజు బకాయిలు చెల్లించాలని కలెక్టరేట్ ఎదుట డిగ్రీ కళాశాలలు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ప్రభుత్వం బకాయిలు విడుదల చేసే వరకు కళాశాలలు తెరవబోమని కళాశాల యాజమాన్యాల అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. నాయకులు పున్నారావ్, హనుమాండ్లు, వర ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అందని ఉన్నత విద్య

- ఇరవై ఏళ్లుగా ఎదురు చూపులు
- అసంపూర్తిగా మహాత్మ జ్యోతిబాపూలే కళాశాల


జైనథ్‌లో అసంపూర్తిగా ఉన్న గురుకుల కళాశాల భవనం

జైనథ్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లాలోనే అతిపెద్ద మండలం అయిన జైనథ్ మండల కేంద్రంలో పాలకులు ప్రభుత్వాలు మారిన ఇప్పటి వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కాలేదు. జైనథ్ మండలంలో దీపాయిగూడ, కూర, లక్ష్మీపూర్, జైనథ్, అడ, బాలాపూర్, పెండల్‌వాడ, పిప్పర్‌వాడ, గిమ్మా, గూడ, మేడగూడ(ఆర్), మేడిగూడ(సి), జైనథ్ కేజీబీవీ, మోడల్ స్కూల్ మొదలగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి ప్రతి సంవత్సరం పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో వందల మంది విద్యార్థులు ఉత్తీర్ణులవుతారు. వీరికి ఉన్నతవిద్య అయిన ఇంటర్ మీడియట్ కళా శాల మండల కేంద్రమైన జైనథ్‌లో లేకపోవడంతో నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్య ద్రాక్షల మారింది. ఉన్నత కుటుంబాలకు చెం దిన విద్యార్థిని విద్యార్థులు ఉన్నత విద్య అయిన ఇంటర్ మీడియట్ చదువు కోసం పక్కన గల బేల మండలంతో పాటు జిల్లా కేంద్రమైన ఆది లాబాద్‌లోని ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలలను ఆశ్రయించి చదువుతున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని మండలాలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా కేవలం జైనథ్ మండ లానికి మాత్రం జూనియర్ కళాశాల లేక పోవ డంతో కళాశాల ఏర్పా టుకు ఇరువై ఏళ్లుగా విద్యార్థులు తల్లిదం డ్రులు మండల ప్రజలు ఎదురు చూస్తున్నారు. ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్ మీడియట్ తెలుగు మీడియం ఇంగ్లీష్ మీడియం చదవాలన్న వేల రూపాయల ఫీజు కట్టవల్సిందే. జైనథ్ మండలంలో పరిస్థితి ఇలా ఉంటే 2016-17 సంవత్సరంలో అప్పుడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం మండల కేంద్రమైన జైనథ్‌లో మహాత్మ జ్యోతి బాపూలే బాలుర గురుకుల కాశాల నిర్మాణానికి 25 కోట్లు మంజూరు చేయగా ప్రస్థుతం కళా శాల భవన నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. జైనథ్ మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల కళా శాల జిల్లా కేంద్రమైన ఆదిలాబాద్‌లో ఓ ప్రైవేట్ భవనంలో నిర్వహి స్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు, జిల్లా యంత్రాంగం స్పందించి మండల కేంద్రమైన జైనథ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను నిర్మించాలని జైనథ్ మండల విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం

- ఆదిలాబాద్ ఆర్‌సీవో గోపిచంద్ రాథోడ్

జైనథ్ మండల కేంద్రంలో ప్రభుత్వ మహా త్మాజ్యోతిబాపూలే బాలుర, బాలికల కళాశాల భవనం రూ.25 కోట్లతో పనులు మధ్యలో ఆగా యి. ఇంకా రూ.3 కోట్ల మంజూరు పై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వివరించాం. వచ్చే జూన్‌లో భవనం పూర్తయితే కళాశాల నడుపుతాం.

ఉపాధ్యాయుడైన పోలీసు..

దస్తురాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పోలీసు కొలువును వదిలి ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు. కడెం మండలానికి చెందిన అల్లం భాస్కర్. జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా 7 సంవత్సరాలు విధులు నిర్వర్తిస్తున్న భాస్కర్ ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి దస్తురాబాద్ మండలంలోని ఆకొండపేట్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా నియామకం పొందారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ రాష్ట్ర సంఘ నాయకులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షులు కోట వేణు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

దళారులకు సోయా అమ్మొద్దు : ఎమ్మెల్యే


సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి) : నేరడిగొండ మండల కేంద్రంలో సోయా కొనుగోలు కేంద్రాన్ని బుధవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే రైతులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ మాట్లాడుతూ రైతులు ఎవరు కూడా దళారుల వద్ద సోయాలు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం మద్దతు ధర క్వింటాల్‌కు రూ.4892 ప్రకటించిందని అన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చే రైతుల కొరకు అధికారులు నీళ్లు, భోజనం సదుపాయలు కల్పించారని అన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫడ్ ఆఫీసర్లతో పాటు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసులు అధికార పార్టీకి వంత పాడుతున్నారు

- మాజీ మంత్రి జోగురామన్న

ఆదిలాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి జోగురామన్న తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూసి నది ప్రాజెక్టులో భారీస్కాం జరిగిందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై ఉట్నూర్ పోలీసులు కేసు నమోదు చేయడం అన్యాయమన్నారు. దీనిని బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా ఖండిస్తుందని పేర్కొన్నారు. అక్రమ కేసులకు భయపడేదే లేదన్నారు. పోలీసులు అధికార పార్టీ అడుగులకు మడుగులు ఒత్తాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. చట్టపరంగా వ్యవహరించాల్సిన పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. రైతులను మోసం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధానమంత్రికి లేఖ రాసిన విషయంపై ఆదిలాబాద్ డీఎస్పీకి ఫిర్యాదు చేస్తే ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. వెంటనే సీఎం పై 420 కేసును నమోదు చేయాలన్నారు. ఎన్నికలకు ముందు ఎన్నో హామీలను ఇచ్చిన రేవంత్‌రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. జిల్లా పోలీసులు తీరు మార్చుకోకుంటే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయన్నారు. రైతుల పక్షాన నిలబడి పోరాటం చేస్తామన్నారు. ప్రశ్నించే గొంతుకను అణగదొక్కేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. అక్రమ కేసులకు బీఆర్ఎస్ కార్యకర్తలు భయపడే ప్రసక్తే లేదన్నారు.

పాముకాటుకు ఆశా వర్కర్ మృతి

ఇంద్రవెల్లి, అక్టోబరు 16 : పాముకాటుకు ఆశావర్కర్ మృతిచెందిన ఘటన బుధవారం మండలంలని కొబ్బయ్‌గూడ గ్రామంలో జరిగింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కొబ్బయ్‌గూడ గ్రామానికి చెందిన కొలాం గిరిజన మహిళా కుంర దుర్పతబాయి (33) గ్రామంలోనే ఆశావర్కర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి భోజనం చేసి కుటుంబ సభ్యులతో కలిసి పడుకున్నారు. రాత్రి సమయంలో నిద్రలో ఉన్నప్పుడు పాముకాటు వేసింది. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలికి భర్త సోనేరావుతో పాటు శ్రీదేవి, సందీప్, అఖిల్‌లు ఉన్నారు.

విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు

బోథ్, అక్టోబరు 16 : బోథ్ మండలంలోని వివిధ గ్రామాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు గాను 23 మంది నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరుతున్నారు. బుధవారం ఒక్కొక్కరుగా వస్తున్న ఉపాధ్యాయులు అపాయింట్‌మెంట్‌కు సంబంధించిన పత్రాలను ఎమ్మార్సీ భవనంలో ఉద్యోగులకు అందిస్తున్నారు. స్థానికంగా మండల విద్యాధికారి లేకపోవడంతో సిబ్బందికి అపాయింట్‌మెంట్ పత్రాలను అందిస్తున్నారు. కాగా గత నెల 30న మండల విద్యాధికారి పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో ఎంఈవోను ఇంత వరకు నియమించలేదు.

ఎమ్మార్పీఎస్ నాయకుల ఆరోపణలు అర్థరహితం

- మాల సంక్షేమ సంఘం నాయకులు

బోథ్, అక్టోబరు 16 : మాల జాతి ముద్దుబిడ్డగా గడ్డం వివేక్ వెంకటస్వామి మాలల హక్కుల కోసం పోరాటం చేస్తున్నాడని ఆయనను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేయడం సరైంది కాదని మాల సంక్షేమ సంఘం నాయకులు పేర్కొన్నారు. బుధవారం బోథ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ నాయకులకు ఎమ్మెల్యేగా రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం ఎలాంటి హక్కు లేదన్నారు. మాలల జనాభాను తక్కువ చూసి చూపించి ఎస్సీ వర్గీకరణ చేయడం జరిగిందన్నారు. 2024 లెక్కల ప్రకారం శాస్త్రీయంగా వర్గీకరణ చేయాలని మాల సంక్షేమ సంఘం నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎల్క రాజు, జాయింట్ సెక్రటరీ మునేశ్వర సోమన్న, గ్రామకమిటీ అధ్యక్షులు సురేందర్ ఉన్నారు.

జీవో 33ను ఏజెన్సీలో అమలు చేయవద్దు

- ఆదివాసీ సంక్షేమ పరిషత్ డిమాండ్

ఉట్నూర్, అక్టోబరు 16 : ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో 33 ఏజెన్సీ ప్రాంతాలలో అమలు చేయవద్దంటూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మకి రామారావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన రవాణా రోడ్లు భవనాల నిర్వహణ కోసం ఇచ్చిన జీవో 33 ఏజెన్సీ ప్రాంతంలో నిలుపుదల చేయాలన్నారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో ఇందిరమ్మ ఇండ్ల ఎంపికను పిజ్జా కమిటీ, గిరిజన మహిళ సంఘాలతో పాటు సర్పంచ్ గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ ద్వారా కమిటీని ఏర్పాటు చేసిన కమిటీల ద్వారానే లబ్దిదారులను ఎంపిక చేయాలన్నారు. షెడ్యూల్డు ప్రాంతంలో ఆదివాసుల భూముల హక్కుల పరిరక్షణ కోసం ఉన్న 1/70 చట్ట ప్రకారం గ్రీన్ గిరిజనేతరులకు భూముల కొనుగోలు అవకాశం లేనందున వలస వచ్చిన గిరిజనేతరులకు ఇళ్ల కేటాయించడం సరైనదని కాదని ఈ విషయంలో చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆర్క ఉమేష్, దేవరావు, ఆత్రందర్మ, ఇంద్రులు పాల్గొన్నారు.

బుద్దవిహార్‌లో వర్షవాస్ ముగింపు

ఇంద్రవెల్లి, అక్టోబరు 16 : ప్రపంచానికి శాంతి, కరుణ, మైత్రి సందేశాన్ని ఇచ్చిన గౌతమ బుద్దుడి మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పూజ్య భంతే ప్రజ్ఞశీల్ అన్నారు. బుధవారం ఇంద్రవెల్లి మండలంలోని పంచశీల బుద్దవిహార్‌లో వర్షవాస్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ బీసీ అభ్యర్థికే ఇవ్వాలి

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీకి జరిగే ఎన్నికల్లో ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ స్థానాన్ని బీసీ అభ్యర్థులకు అవకాశం ఇస్తేనే మద్దతు ఇస్తామని బీసీ కులాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. బుధవారం ఆ సంఘం నాయకులు విలేకరులతో మాట్లాడుతూ... జనాభాలో 52 శాతానికి పైగా ఉన్న బీసీ కులాలను విస్మరిస్తూ కేవలం ఓటు బ్యాంకుగానే ఉపయోగించుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ఈసీలు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. బీసీ అభ్యర్థులు ఇప్పటి నుంచి అన్నిస్థాయిల్లో జరిగే ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందేలా కృషి చేయాలన్నారు. బీసీలను విస్మరించే పార్టీలకు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. ఐక్య వేదిక అధ్యక్షుడు నిమ్మగణేష్, కార్యదర్శి కిషన్, సభ్యులు శ్రీహరి, సతీష్, శంకర్, జుబేద్, రాజు పాల్గొన్నారు.

ఆశా స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేయండి

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్టేట్‌బ్యాంక్ ఇండియా వారు అందించే ఆశా స్కాలర్‌షిప్ కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 12 తరగతుల విద్యార్థులకు మూడు వందల మందికి అందించనుందన్నారు. ఎంపికైన వారికి 15 వేల నగదు బహుమతి అందించనుందన్నారు. సంబంధిత సర్టిఫికెట్లతో ఈ నెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు.

పారిశుధ్య లోపం లేకుండా చర్యలు చేపట్టాలి

- మండల ప్రత్యేక అధికారి జీవరత్నం

ఖానాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్య లోపం లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని మండల పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక అధికారి జీవరత్నం సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయనపై ఆదేశాలు జారీ చేశారు. వెంటనే ఇంటి పన్నుల బకాయిలను వసూలు చేయాలన్నారు. వ్యాపార లైసెన్స్‌లను ఎప్పటికప్పుడు రెన్యువల్ చేయాలన్నారు. గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా చెత్తా చెదారం, ప్లాస్టిక్ కవర్లు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సునీత, ఎంపీవో చిక్యాల రత్నాకర్‌రావు, తదితరులున్నారు.

నిర్మల్ ఏఎంసీ డైరెక్టర్లకు సన్మానం

నర్సాపూర్(జి), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు ఎంఏ అజీమ్, అర్లి(కే) గ్రామానికి చెందిన చంద్యాల మురళి నిర్మల్ అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. కాగా ఇద్దరు డైరెక్టర్లను నర్సాపూర్(జి) మండల నాయకులు సన్మానించారు. సన్మానించిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మల్లేష్, నాయకులు కొంద్రరమేష్, గాదె సంతోష్, కాల్వ రఘు, గోపిడి గంగారెడ్డి, సిందే సాయినాథ్ పటేల్, సంతోష్, ప్రవీణ్‌రెడ్డి, కుమ్మరి సాయన్న, రాజు, తదితరులున్నారు.

12 మంది ఉపాధ్యాయుల నియామకం

ముథోల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం 11 వేలకు పైగా డీఎస్సీ ద్వారా నూతనంగా ఉపాధ్యాయ నియామకం జరపగా ముథోల్ మండలానికి 12 మంది ఉపాధ్యాయ పోస్టులు జిల్లా విద్యాశాఖ కేటాయించింది. బుధవారం వారు విధుల్లోకి చేరారు. మండలంలోని ఉర్దూ మీడియం పాఠశాలలకు ముగ్గురు ఎస్‌జీటీ ఉపాధ్యాయులు, తెలుగు మీడియం ప్రాథమిక పాఠశాలకు ఐదుగురు ఉపాధ్యాయులు, అదే విధంగా ఉన్నత పాఠశాలలకు నలుగురు (స్కూల్ అసిస్టెంట్‌లు) నూతన ఉపాధ్యాయులు వచ్చారు. అయితే మండలానికి నూతనంగా సెలెక్ట్ అయిన ఉపాధ్యాయులు వారికి కేటాయించిన పాఠశాలలో జాయినింగ్ అయ్యేందుకు స్థానిక మండల విద్యావనరుల కార్యాలయానికి వచ్చినట్లు ఎంఈవో రమణారెడ్డి తెలిపారు. 8 మంది ఎస్‌జీటీ ఉపాధ్యాయులు ఎంఈవో కార్యాలయంలో జాయినింగ్ అయ్యేందుకు రాగా మిగతా నలుగురు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు వారికి కేటాయించిన ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల సమక్షంలో జాయినింగ్ అయ్యారు.

రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చాలి : జిల్లా సైన్స్ అధికారి


ప్రయోగాలను వివరిస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్ అర్బన్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో కూడా రాణించాలని జిల్లా సైన్స్ అధికారి రఘురమణ అన్నారు. బుధవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెంబర్ టూలో జిల్లా స్థాయి జాతీయ సైన్స్, సదరన్ ఇండియా సైన్స్ డ్రామా పోటీలను నిర్వహించారు. ఇందులో ఆయా పాఠశాలల విద్యార్థులు సైన్స్‌తో కూడిన ప్రదర్శనలతో అలరించారు. పర్యావరణం, ప్రజలకు ఉపయోగపడే విషయాలను వివరిస్తూ పోటీల్లో పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలు వారి ప్రతిభ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేశారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందించి రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. కాగా రాష్ట్ర స్థాయిలో పోటీలు ఈ నెల 18న హైదరాబాద్‌లో జరుగనున్నాయి. ఇక్కడ ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో పాల్గొనున్నారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి రఘురమణ మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్ ప్రయోగాలపై అవగాహన పెంచేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా స్థాయి జాతీయ సైన్స్, సదరన్ ఇండియా సైన్స్ డ్రామా పోటీలకు స్పందన వచ్చిందన్నారు. సైన్స్ సెమినార్‌లో 16 మంది విద్యార్థులు, డ్రామాలో ఏడు పాఠశాలలు ఆరు థీమ్స్‌తో పాల్గొన్నాయన్నారు. ఇందులో సెమినార్‌కు జోసెఫ్ కాన్వెంట్ స్కూల్ విద్యార్థి, డ్రామాలో జడ్పీఎస్ఎస్ లక్ష్మీపూర్‌లు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. వీరు హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయికి వెళ్తారన్నారు.

పురుషుడిపై మరో పురుషుడి లైంగిక దాడి

ఇచ్చోడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పురుషుడిపై మరో పురుషుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఇచ్చోడ మండలంలోని ఓ గ్రామంలో బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు(20) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి (32) మూగవాడు. ఇంకా పెళ్లి కాలేదు. ఇంటి వద్దే ఖాళీగా ఉంటాడు. ఈనెల 13వ తేదీన రాత్రి సమయంలో మూగ వ్యక్తిని సదరు యువకుడు పని ఉందంటూ పక్కనే గల పంట పొలానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితుడికి రక్తస్రావం కావడంతో.. జరిగిన విషయంపై కుటుంబసభ్యులు ఆరా తీశారు. అసలు విషయం తెలుసుకున్న కుటుంబీకులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం

తలమడుగు అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు పరచడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ సభ్యత్వం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆదిలాబాద్ బీజేపీ పార్టీ అధ్యక్షులు పతంగి బ్రహ్మానందం హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో మాఫీ చేయలేదన్నారు. అదే విధంగా పెట్టుబడి సాయం కింద రైతు బంధు ఇవ్వలేదన్నారు. గ్రామం దేశం అభివృద్ధి చెందాలంటే బీజేపీతోనే సాధ్యమన్నారు. అందుకు ప్రతి ఒక్కరు భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదును ఆన్‌లైన్ ద్వారా తీసుకోవాలని సూచించారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ సభ్యత్వ నమోదు ప్రారంభించారు. అదే విధంగా వాటి కోసం కష్టపడే కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందన్నారు. స్థానికసంస్థ ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు టికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తే కేసులా...?

ఖానాపూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ప్రతిపక్షంపై కేసులు నమోదు చేస్తారా అంటూ బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ మండిపడ్డారు. బుధవారం మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఉట్నూర్‌లో మాజీ మంత్రి కేటీఆర్‌పై కేసు నమోదు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఆదిలాబాద్‌లో మాజీ మంత్రి జోగురామన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే కనీసం ఫిర్యాదను స్వీకరించని పోలీసులు మాజీ మంత్రి ప్రధాన ప్రతిపక్ష కీలకనేత కేటీఆర్‌పై కేసు ఎలా నమోదు చేస్తారని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలోనే ఉద్దండులైన నాయకులను ఎదిరించి తెలంగాణ ఉద్యమాన్ని చేసి బీఆర్ఎస్ స్వరాష్ట్రాన్ని సాధించిందన్నారు. కేసీఆర్, కేటీఆర్‌లకు కేసులు కొత్తేమి కాదన్నారు. కేసులతో భయపెట్టి రాష్ట్రంలో పాలన చేయాలనుకోవడం ఖచ్చితంగా కాంగ్రెస్ నాయకుల అవివేకమేనన్నారు. ఇప్పటికైనా తప్పుడు కేసులను మానుకొని ప్రజలకు ఇచ్చిన 420 హామీలను నిలబెట్టుకోవాలన్నారు. లేని పక్షంలో తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామే తప్పా వెనక్కి తగ్గేది లేదన్నారు. అధికారం శాశ్వతం కాదనే వాస్తవాన్ని కాంగ్రెస్ నాయకులు గ్రహిస్తే బాగుంటుందన్నారు. పార్టీలతో రాజకీయాలతో సంబంధం లేకుండా పోలీసువ్యవస్థ తన పని తాను చేసుకుపోవాలన్నారు.

నిర్మల్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ఈటెల శ్రీనివాస్


ఈటెల శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న దృశ్యం

లక్ష్మణచాంద, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ మార్కెట్ వైస్ చైర్మన్‌గా మండల కేంద్రానికి చెందిన ఈటెల శ్రీనివాస్ బుధవారం పదవీప్రమాణ స్వీకా రం చేశారు. తెలం గాణ మలిదశ ఉద్యమ సమయం నుంచి శ్రీహరి రావు వెన్నంటి ఉన్నం దుకు ఈ పదవీ లభించిందని, అవకాశం ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి, శ్రీహరి రావులకు కృతజ్ఞతలు తెలిపారు. లక్ష్మణ చాంద మండలానికి తొలి సారి ఈ పదవీ దక్కడం పట్ల పలువురు సంతోషం వ్యక్తం చేశారు. శాలు వా, పూలమాలతో ఆయనను సన్మానిం చారు. అలాగే మండలం నుండి డైరెక్టర్లుగా ఎంపికైన మునిపెల్లి గ్రామా నికి చెందిన ఎస్‌డీ ఖలీల్‌ను, లక్ష్మణచాంద గ్రామానికి చెందిన సురేష్‌ను కూడా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓడ్నాల రాజేశ్వర్, సీనియర్ నాయకులు అబ్బడి ప్రతాప్ రెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు కోంద్ర నరేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఎస్‌డీ సయ్యద్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గురాల లింగారెడ్డి పాల్గొన్నారు.

అక్రమ కేసులను ఎత్తివేయాలి

- బంద్ పాటించిన గ్రామస్థులు

కుభీర్, అక్టోబరు 16 : ఓ వర్గానికి చెందిన ఎనిమిది మంది యువకులపై పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తూ బుధవారం దుకాణ సముదాయాలను బందు చేయించారు. దుర్గామాత నిమర్జన ఉత్సవంలో ఓ వర్గానికి చెందిన యవకులు మరో వర్గానికి చెందిన వారిని కించపరుస్తూ నినాదాలు చేశారని వీడియోలు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారని ఆరోపించారు. మంగళవారం రాత్రి 11.30 గంటలకు మరో వర్గానికి చెందిన కొందరు కుభీర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా బుధవారం ఉదయం పోలీసులు 8మంది యువకులను అరెస్టు చేశారు. దీంతో తమ పిల్లలను కారణం లేకుండా అరెస్టు చేయడం ఏంటని బుధవారం కుభీర్ బంద్‌కు పిలుపునిచ్చారు. అనంతరం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సంఘటితంగా ఉండి అక్రమ కేసులు ఎత్తివేసేలా చర్యలు తీసుకుందామని పేర్కొన్నారు. సమాచారం అందుకున్న నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీషర్మీల కుభీర్ పోలీసుస్టేషన్‌కు చేరుకొని గ్రామస్థులతో మాట్లాడారు. ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో చేసుకోవాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

దిలావర్‌పూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పీవీ రమణారెడ్డి అన్నారు. బుధవారం దిలావర్‌పూర్‌లో వరి ధాన్యం, సోయాబీన్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మధ్య దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. నాణ్యమైన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ స్వాతి, మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్‌రెడ్డి, ఏఈవోలు మౌనిక, శ్రీవాణి సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

కుంటాల, అక్టోబర్, 16 : డిగ్రీ కళాశాలలో గత మూడు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న డిగ్రీ, పీజీ విద్యార్థుల రీయంబ ర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిగ్రీ కళాశాలల టీపీడీపీఎంఏ ఎగ్జిక్యూటివ్ మెంబర్ బోయిని సాయిలు పేర్కొన్నారు. డిగ్రీ కళాశాలల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గత మూడు రోజుల నుండి చేపడుతున్న నిరవధిక సమ్మెలో భాగంగా బుధవారం కల్లూరు వాసవి కళాశాల ఎదుట కళాశాల యాజమాన్యం ఆధ్వర్యం లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పం దించి ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఉద్యమకారుల డిమాండ్‌లు పరిష్కరించాలి

- తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు

ఇంద్రవెల్లి, అక్టోబరు 16 : తెలంగాణ ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్‌లను తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాసర్ల శ్రీశైలం అన్నారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు అమలు కోరుతూ తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో ఆదిలాబాద్ నుంచి ప్రారంభించిన పాదయాత్ర బుధవారం ఇంద్రవెల్లి మండల కేంద్రం మీదుగా కొనసాగింది. ముందుగా మండలంలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 1200 మంది అమరుల ఆత్మ బలిదానాల సాక్షిగా ఉద్యమ పార్టీ ముసుగులో అధికారం చేపట్టిన కేసీఆర్ ప్రభుత్వం ఉద్యమకారుల ఆకాంక్షలకు తూట్లు పొడిచిన విధంగా వ్యవహరిస్తూ ఉద్యమ ఆకాంక్షలను నిర్వీర్యం చేస్తూ పరిపాలన కొనసాగించారని అన్నారు. తెలంగాణ ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉద్యమ ఆకాంక్షలు అమలు చేస్తామని వాగ్దానం చేయడం జరిగిందన్నారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన

ప్రభుత్వ పాఠశాలలకు.. మంచిరోజులు





- జిల్లాలో పాఠశాల విద్య బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధమైన చర్యలు
- విద్యా ప్రమాణాలు పెంచేందుకు నోడల్ వ్యవస్థ
- ప్రతీ మండలానికి ఎంఈవోల నియామకం
- విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు
- మెరుగుపడనున్న విద్యా బోధన
- నిర్మల్ జిల్లావ్యాప్తంగా మొత్తం 735 ప్రభుత్వ పాఠశాలలు

భైంసా, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్య బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికబద్దబద్ధమైన చర్యలు చేపడుతోంది. వ్యవస్థ మెరుగుదలకు పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. బోధనలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు పాఠశాల సముదాయం, మండల పరిధిగా నోడల్ వ్యవస్థను ప్రవేశ పెట్టింది. వీటితో పాటు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టుల ఖాళీల భర్తీని చేపట్టింది. దీంతో గత కొంత కాలంగా సర్కారు పాఠశాలల్లో గాడితప్పిన విద్యాబోధన మెరుగుకానుందని పిల్లల తల్లిదండ్రుల్లో ఆశలు చిగురించాయి.

278 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ

జిల్లాలో మొత్తం 735 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 533, ప్రాథమికోన్నత పాఠశాలలు 85, ఉన్నత పాఠశాలలు 117 ఉన్నాయి. కాగా జిల్లాలో మొత్తం 342 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా.. 2024 డీఎస్సీ ద్వారా 278 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ జరిగింది.

పర్యవేక్షణ లేకపోవడంతో..

మండలానికో విద్యాధికారి లేకపోవడం మూలంగా ఉపాధ్యాయుల హాజరు, విద్యాప్రగతి, సమయపాలనను పర్యవేక్షించే వ్యవస్థ లేకుండా పోయింది. అదనపు బాధ్యతలతో ఎంఈవోలు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేపట్టలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో నిర్వహణ వ్యవస్థ లోపభూయిష్టంగా ఉండటాన్ని అలుసుగా తీసుకున్న కొన్ని పాఠశాలల్లోని ఉపాధ్యాయులు విధులకు ఎగనామం పెడుతూ ఇష్టరాజ్యంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. కొన్ని పాఠశాలల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు స్వంత పనులకే పరిమితమవుతూ తాము విధులు నిర్వహించే పాఠశాలల్లో వాలంటీర్‌ను నియమించి బోధన కొనసాగించినట్లుగా సమాచారం. ఇలా కొంత మంది ఉపాధ్యాయులు ఇతర కార్యకలపాల్లో నిమగ్నమవుతూ బోధనను అటకెక్కిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పర్యవేక్షణ కొరవడి సిలబస్ పూర్తికాని పరిస్థితి. పలు ఉన్నత పాఠశాలల్లో హిందీ బోధించే ఉపాధ్యాయులు లేకపోవడం గమనార్హం. విద్యార్థులు ఉన్న చోట ఉపాధ్యాయుల కొరత, పిల్లలు లేని చోట అధికంగా ఉన్నారు. సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించినప్పటికీ ప్రతికూల పరిస్థితులతో జిల్లాలో పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదు. జిల్లాల పునర్విభజ అనంతరం అప్పటి ప్రభుత్వం ఉప విద్యాధికారుల వ్యవస్థను రద్దు చేయడంతో జిల్లాలో విద్యాబోధన పర్యవేక్షణ నామమాత్రంగానే జరిగింది.



- భైంసా ఎంఈవో సుభాష్‌కు చేరిక కాపీని అందచేస్తున్న నూతన ఉపాధ్యాయురాలు

నోడల్ అధికారుల నియామకం

ప్రస్తుతం మండలానికో ఇంచార్జి ఎంఈవోను ప్రభుత్వం నియమించింది. బోధనలో నాణ్యత పెంచేందుకు మండల స్థాయిలో సీనియర్ ప్రధానోపాధ్యాయుడిని నోడల్ అధికారిగా నియామకం చేసింది. పాఠశాల సముదాయం పరిధిలో అవసరమైన కార్యాచరణ రూపొందించాల్సిన బాధ్యతను నిర్దేశిత స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడికి బదాలయించింది. వీరందరూ నిర్దేశించిన విధులు నిర్వహిస్తున్నారా? లేదా? అని పర్యవేక్షించాల్సిన బాధ్యతను డీఈవోతో పాటు సెక్టోరియల్ అధికారులకు అప్పగించింది.



పాఠశాలల కేటాయింపులు

నిర్మల్ జిల్లాలో 342 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలుండగా.. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల ద్వారా 278 పోస్టుల భర్తీ జరిగింది. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నూతనంగా నియమింపడిన ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలల కేటాయింపులు చేపట్టారు. ఎంపికైన వారికి ఉత్తర్వులు అందచేశారు. బుధవారం ఉత్తర్వులు అందుకున్న నూతన ఉపాధ్యాయులందరూ ముందుగా ఆయా మండల కేంద్రాల్లోని ఎంఈవో కార్యాలయాల్లో, అనంతరం సంబంధిత పాఠశాలల్లో విధుల్లో చేరారు. చేరిక ప్రక్రియ పూర్తయిన తదుపరి నూతన ఉపాధ్యాయులు తరగతి గదులకు వెళ్లి విద్యా బోధనకు శ్రీకారం చుట్టారు.

అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం

: రవీందర్ రెడ్డి, జిల్లా విద్యాధికారి, నిర్మల్



ప్రభుత్వం పాఠశాల విద్యను బలోపేతం చేసేందుకు చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా ఇన్‌చార్జి ఎంఈవోలను నియమించింది. ఖాళీగానున్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేపట్టింది. పాఠశాలల్లో బోధన ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నాం.

ఫొటో న్యూస్



పత్తి కొనుగోళ్లకు సిద్ధమైన మార్కెట్‌యార్డులో లోడింగ్ బ్యాలెన్స్ చెక్ చేస్తున్న సిబ్బంది

పత్తి కొనుగోళ్లకు మార్కెట్‌యార్డు ముస్తాబు

ఆదిలాబాద్ జిల్లా లో ఈ వానాకాలం (ఖరీఫ్ సీజన్)కు సంబంధించి పత్తి కొనుగోళ్లకు జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లలో మార్కెటింగ్ అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు. ఎలక్ట్రానిక్ కాంటాలతో పాటు వెయింగ్ మిషన్లకు, పత్తిలో తేమ శాతం నిర్ధారించే పరికరాలకు మరమ్మతులు చేయించి సిద్ధం చేస్తున్నారు. మరికొన్ని రోజుల్లో పత్తి కొనుగోళ్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి.

(- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్)




- రైతులు కూర్చునే స్థలం
- ఆదిలాబాద్ మార్కెట్‌యార్డు
- సాఫ్ట్‌వేర్ చెక్ చేసుకుంటున్న సిబ్బంది

మరమ్మతులకు నిధులు వచ్చేనా?!

ఉట్నూర్, అక్టోబరు16: గత వర్షాకాలంలో కురిసిన వర్షాలకు కొట్టుకు పోయిన రోడ్ల మరమ్మతులకు నిధులు వస్తాయా? అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఉట్నూర్ మండలంలోని దొంగచింత గ్రామ సమీపంలో వాగుపైన నిర్మించిన వంతెన వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు ఒకపక్క రోడ్డు పూర్తిగా కొట్టుకు పోయింది. పులిమడుగు వాగు సమీపంలో పులిమడుగు వైపు అప్రోచ్ రోడ్డు కొట్టుకు పోయింది. దొంగచింత నుంచి కుమ్మరికుంటకు వెళ్లే దారిలో సైతం రోడ్డుకు అక్కడక్కడ గండ్లు పడ్డాయి. వర్షాకాలంలో చెడిపోయిన రోడ్లకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేపట్టాలని ఆదివాసీ గిరిజనులు కోరుతున్నారు.



దొంగచింత వద్ద వరదలకు తెగిపోయిన రోడ్డు(ఫైల్)



- భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామ శివారులో ఏపుగా పెరిగిన పత్తి పంట

ఆదిలాబాద్ జిల్లాలో ఆశాజనకంగా పంటలు!

- వానాకాలం సీజన్‌లో భాగంగా పత్తి, కంది, పెసర, సోయా, మొక్కజొన్న పంటల సాగు
- పత్తి దిగుబడులపై రైతుల ఆశలు

భీంపూర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో వానాకాలం(ఖరీఫ్ సీజన్)లో సాగు చేస్తున్న పత్తి, కంది, పెసర, సోయా, మొక్కజొన్న, తదితర పంటలు ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. గత ఏడాది కంటే ఈ ఏడాది పత్తి దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు. పత్తి పంట ఏపుగా పెరిగి పూత సమృద్ధిగా ఉండటంతో రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండలంలో పత్తి పంట 26,150 ఎకరాలు, సోయా 900ఎకరాలు, మొక్కజొన్న 350 ఎకరాలు, కంది 2,600 ఎకరాలు పంటలు సాగులో ఉన్నాయి. రైతులు మందులు పిచికారి చేస్తున్నారు. పత్తి పంటకు ఏ సమయంలో ఏ మందులు వాడాలో వ్యవసాయ అధికారి తదితర సూచనలు, సలహాలు ఇస్తున్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ రైతులు పురుగుల మందు స్ప్రే చేస్తుండటంతో రోజుకో విధంగా పత్తి పంట ఆశాజనకంగా కనిపిస్తుంది రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గిట్టుబాటు ధర లభ్యమయ్యేనా?

గత ఏడాది కంటే ఈ ఏడాది పత్తి పంట ఆశాజనకంగా ఉండటంతో గిట్టుబాటు ధర లభ్యం అవుతుందో? లేదో? అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది ప్రైవేట్ వ్యాపారస్తులు గిట్టుబాటు ధర చెల్లించకపోవడంతో సీసీఐ పత్తిని విక్రయించారు. అంతేకాకుండా ప్రైవేట్ రైతులకు గిట్టుబాటు ధర చెల్లించడం మీన మేషాలు లెక్కిస్తున్నారు. దీంతో రైతులు సీసీఐ సకాలంలో డబ్బులు చెల్లించినప్పటికీ గత్యంతరం లేక రైతులు పత్తి పంటను సీసీఐకే విక్రయించారు. సీసీఐ సిబ్బంది కూడా తేమ శాతంలో కొర్రీలు పెడుతూ పత్తి కొనుగోలు చేస్తుండటంతో మరోవైపు రైతులు కూడా జీర్ణించుకోకపోతున్నారు.

ఈ ఏడాది పంటలు వర్షాల వల్ల దెబ్బతిన్నాయి

: జట్టల విఠల్, యువ రైతు, పిప్పల్‌కోటి గ్రామం



ఈ ఏడాది పత్తి పంటలు వర్షాల వల్ల కొంత దెబ్బతిన్నాయి. అడవి పందుల నుంచి పంటలను కాపాడుతూ వస్తున్నాం. పత్తి పంట అమ్మే సమయంలో దళారులు దండుకోకుండా అధికారులు నియంత్రించాలి. తేమశాతం అంటూ సీసీఐ అధికారులు రైతులను ఇబ్బందులు పెట్టొద్దు.

మందు పిచికారి చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

: శ్రీనివాస్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి, భీంపూర్



రైతులు తమ పంటలకు పిచికారి చేసేటప్పుడు మొకానికి మాస్క్, అప్రాన్ ధరించాలి, కండ్లకు అద్దాలు పెట్టుకోవాలి. కాళ్లకు బూట్లు వేసుకోవాలి. ముక్కు, కళ్ళు, చెవులు, చేతులకు మందు చిల్లకుండ చూసుకోవాలి. నీళ్లలో కలిపిన మందు 24 గంటల లోపే పిచికారి చేయాలి. పిచికారి సమయంలో తంబాకు, గుట్కా తినకూడదు. బీడీ, సిగరేట్‌లు తాగకూడదు. తినే సమయంలో చేతులు, మోకం సబ్బుతో బాగా కడుక్కోవాలి.



అభివృద్ధి పనులకు నిధుల విడుదల

ఆదిలాబాద్అర్బన్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): సీఆర్ఆర్ ప్లేన్ గ్రాంట్స్ కింద నియోజకవర్గానికి బీటీ రోడ్డు, బ్రిడ్జి పనుల నిమిత్తం రూ.10కోట్లు విడుదలై నట్లు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్ స్త్రీ మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు లేఖల ద్వారా ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ప్రస్తుతం రూ.10కోట్లు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రికి, ఇన్‌చార్జి మంత్రికి కంది శ్రీనివాస్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఎంసీహెచ్ కిట్ ఏదీ!?

- జిల్లాలో బాలింతలకు అందని కిట్‌బ్యాగ్
- ప్రోత్సాహక నగదుకు నోచుకోని లబ్ధిదారులు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో పడిపోతున్న ప్రసవాల సంఖ్య
- పథకం కొనసాగింపుపై చేతులెత్తేసిన ప్రభుత్వం





పై ఫొటోలో కనిపిస్తున్న ఆసుపత్రి.. ఏజెన్సీ మండలమైన తలమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం. ఈ మండలం దాదాపుగా ఏజెన్సీ ప్రాంతంలోనే ఉంది. ఇక్కడ ఒక వైద్యుడితో పాటు పలువురు వైద్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. గతంలో కేసీఆర్ కిట్ పథకం అమలుతో 2023 ఆగస్టు మాసంలో ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 18 సాధారణ ప్రసవాలు జరిగినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోంది. 2024 ఆగస్టు మాసంలో కేవలం 9 ప్రసవాలు మాత్రమే జరిగినట్లు సమాచారం. అంటే సగానికి పైగా ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రిలో పడిపోయినట్లు తెలుస్తోంది. ఇలాంటి పరిస్థితే జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనిపిస్తోందని అధికారులు చెబుతున్నారు.

ఆదిలాబాద్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎంసీహెచ్ కిట్ (మాతా శిశు ఆరోగ్య పథకం) బాలింతలకు అందడం లేదు. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన కేసీఆర్ కిట్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎంసీహెచ్ కిట్ (మాతా శిశు ఆరోగ్య పథకం)గా పేరు మార్చింది. అయితే ఈ పథకం అమలుకు నోచుకోవడం లేదు. దీంతో జిల్లాలో వేలాది మంది బాలింతలకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువవుతోంది. ప్రభుత్వాసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచుతూ మాతాశిశు మరణాల రేటును తగ్గించేందుకు గత ప్రభుత్వం 2017 జూన్ 4న కేసీఆర్ కిట్ పథకాన్ని అమల్లోకి తెచ్చింది. దీంతో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా జిల్లాలోని ఏజెన్సీ మారుమూల ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ పథకం అమలుతో కొంత వరకు సత్ఫలితాలనే ఇచ్చిందని చెప్పొచ్చు. కేసీఆర్ కిట్ పథక అమలుకు ముందు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అంతగా ప్రసవాలు ఉండేవి కావు. అలాగే మాతాశిశు మరణాల రేటు అధికంగానే ఉండేవని వైద్యులు చెబుతున్నారు. కేసీఆర్ కిట్ అమలు తర్వాత పరిస్థితుల్లో కొంత మార్పు కనిపించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా 2017 నుంచి 2023 నవంబర్ వరకు 44వేల 930 మంది లబ్ధిదారులకు కేసీఆర్ కిట్ బ్యాగ్, నగదు సహాయాన్ని అందించారు. అప్పట్లోనే మరో 733 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించిన కేసీఆర్ కిట్ మాత్రం అందడం లేదని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో ఈ పథకాన్ని పూర్తిగా నిలిపి వేశారు. గత 9 నెలలుగా అర్హులైన లబ్ధిదారులకు కేసీఆర్ కిట్, నగదు సహాయం అందడమే లేదంటున్నారు. ఇలాంటి పరిస్థితులతో కేసీఆర్ కిట్ పథక అమలుపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పేరు మార్చినా.. అంతే సంగతి !

గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన కేసీఆర్ కిట్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎంసీహెచ్ కిట్ (మాతా శిశు ఆరోగ్య పథకం)గా పేరు మార్చింది. అయినా ఈ పథకం అమలుకు నోచుకోవడం లేదు. దీంతో వేలాది మంది బాలింతలకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువవుతోంది. అలాగే కేసీఆర్ కిట్ బ్యాగ్‌తో పాటు మూడు విడతల వారీగా అందించే నగదు సహాయం అందడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.



బాలింతకు కేసీఆర్ కిట్‌ను అందిస్తున్న నాయకులు (ఫైల్)

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలకు 16 వస్తువులతో కూడిన కిట్ బ్యాగ్‌తో పాటు నగదు సహాయం, మగ శిశువు జన్మిస్తే రూ.12వేలు ఆడ శిశువు జన్మిస్తే అదనంగా మరో వెయ్యిని కలిపి రూ.13వేల నగదు సహాయాన్ని అందించారు. గతంలో ప్రభుత్వం ఇచ్చే కిట్ బ్యాగ్‌లో తల్లి బిడ్డలకు ఉపయోగపడే సబ్బులు, దోమతెర, డ్రెస్‌లు, రెండు చీరలు, హ్యాండ్‌బ్యాగ్, టవల్స్, పౌడర్స్, డైపర్, షాంపు, చిన్నపిల్లల బొమ్మలు ఇలా 16 రకాల వస్తువులతో కిట్ బ్యాగ్‌ను అందించే వారు. దీంతో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరగడంతో పాటు గర్భసంబంధిత సమస్యలను నివారించడం, శిశుమరణాల రేటును తగ్గించడాన్ని లక్ష్యంగా ఈ పథకాన్ని అమలు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కేసీఆర్ కిట్ పథకం పేరు మార్చిన అమలుకు మాత్రం నోచుకోవడం లేదు. అసలు భవిష్యత్తులో ఈ పథకాన్ని కొనసాగిస్తారా!? లేదా!? అన్న దానిపై వైద్య ఆరోగ్యశాఖాధికారులే స్పష్టంగా చెప్పలేని పరిస్థితి కనిపిస్తోంది.



ప్రభుత్వ ప్రోత్సాహం అందడం లేదు..
: రాథోడ్ నీలాబాయి (పల్సి తండా, తలమడుగు)



ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవమైన ఎలాంటి ప్రోత్సాహం అందడం లేదు. కేవలం మందులతోనే సరిపెడుతున్నారు. గతంలో కేసీఆర్ కిట్ బ్యాగ్‌తో పాటు నగదు సహాయాన్ని అందించారు. ఇప్పుడు అవి రావడం లేదని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి ముఖ్యంగా పేద, మధ్య తరగతి వారే వెళ్తారు. వారి ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కొంత సహాయాన్ని అందిస్తే బాగుంటుంది.

ప్రభుత్వ ఆదేశాలతో అమలు చేస్తాం..
: డా.కృష్ణ (డీఎంఅండ్‌హెచ్‌వో, ఆదిలాబాద్)



గతంలో అమలు చేసిన కేసీఆర్ కిట్‌ను మళ్లీ ప్రభుత్వ ఆదేశాలతో అమలు చేస్తాం. ప్రస్తుతం కేసీఆర్ కిట్ పథకాన్ని ఎంసీహెచ్ కిట్ పథకంగా మార్చడం జరిగింది. గతంలో మాదిరిగానే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. గత కొంత కాలంగా కేసీఆర్ కిట్ బ్యాగ్‌ల సరఫరా నిలిచి పోయింది. ప్రభుత్వ తదుపరి ఆదేశాలతో మళ్లీ పథకాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటాం.

తగ్గుముఖం పట్టిన ప్రసవాలు ..

కొంత కాలంగా కేసీఆర్ కిట్ పథకం అమలు నిలిచిపోవడంతో గర్భిణులు ప్రైవేట్ ఆస్పత్రుల వైపే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య తగ్గుతూ వస్తోంది. గతంలో కిట్ బ్యాగ్‌తో నగదు సహాయం అందేది. ప్రస్తుతం అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. 2023, ఆగస్టు నెలలో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో 908 సాధారణ ప్రసవాలు జరగగా.. 2024 ఆగస్టు నెల ముగిసే సరికి 770 ప్రసవాలు జరిగినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోంది. దీనికి తోడు వైద్యుల కొరత తీవ్రంగా ఉన్నట్లు తెలిసింది. ఏజెన్సీ మారుమూల మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నే ప్రసవాల సంఖ్య కొంత ఎక్కువగా కనిపిస్తుంది. మైదాన ప్రాంతం, జిల్లా కేంద్రం చుట్టు పక్కల ఉన్న మండలాల పరిధిలోని వారంతా జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో జిల్లా ఉన్నతాధికారులు మండల స్థాయి అధికారులపై ఒత్తిళ్లు తీసుకొస్తున్నా.. ఆశించిన స్థాయిలో ప్రయోజనం కనిపించడం లేదంటున్నారు.

సంక్షిప్త సమాచారం

విధుల్లో చేరిన వ్యవసాయ అధికారులు

ఆదిలాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో బుధవారం 10 మంది మండల వ్యవసాయ అధికారులు (ఎంఏవో)లు విధుల్లో చేరినట్లు ఇన్‌చార్జి ఏడీఏ శివకుమార్ తెలిపారు. ఇందులో కేంద్రే ఆకాశ్ (ఏవో నార్నూర్ 1), తడెంవిశ్వనాథ్ (ఏవో, డీఏవో ఆదిలాబాద్), రాథోడ్ శ్రద్ధారాణి (ఏవో, సిరికొండ), జంగంవార్ పూజ (ఏవో, జైనథ్ 1), మహమ్మద్ సహిద్ (ఏవో, బజార్‌హత్నూర్), లింగంపల్లి రవితేజ (ఏవో, బోథ్), కె.కృష్ణవేణి (ఏవోనేరడిగొండ), జె.వెంకన్న (ఏవో, నార్నూర్ 2), సాయితేజ (ఏవో,బేల), జాహ్నవి (ఏవో, డీఏవో ఆదిలాబాద్)గా బాధ్యతలు స్వీకరించారని ఏడీఏ శివకుమార్ పేర్కొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల తనిఖీ

ఉట్నూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను రీజినల్ ఇంటర్మీడియట్ ఆఫీసర్ రవీందర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుశాతం, తరగతులను పరీక్షలు వాటి రిజల్టు గురించి, రికార్డులను తనిఖీ చేసి అధ్యాపకులకు విద్యాధికారి రవీందర్ సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ధనరాజ్, ఆదిలాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ సూపరింటెండెంట్ మోసిన్, అధ్యాపకులు శ్రీనివాస్, సువర్ణ, శ్రీలత, గణేష్, వినోద్, తిరుపతి, దశరథ్, కిషోర్, రూప, శివప్రసాద్, అధ్యాపకేతరులు మల్లేష్, శంకర్, ప్రకాష్, సాయికృష్ణలు పాల్గొన్నారు.

ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలి : ఎస్పీ

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. బుధవారం వార్షిక తనిఖీల్లో భాగంగా ఆదిలాబాద్ డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీకి సాయుధ బలగాలతో కూడిన బృందం గౌరవ వందనాలు అందించింది. ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, పట్టణ సీఐలు సునీల్, కరుణాకర్ పుష్పగుచ్ఛం అందించి సాదరంగా ఆహ్వానించారు. కార్యాలయ పరిసరాలను చుట్టూ తిరిగి పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆదిలాబాద్ పట్టణంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో వచ్చే ప్రతి ఒకఫిర్యాదుదారు పిటిషన్ వెంటనే నమోదు చేసి సంబంధిత అధికారులకు అప్పగించి సమస్య పరిష్కా రానికి కృషిచేయాలని అధికారులకు సూచించారు. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించినప్పుడే ప్రజల్లో పోలీసుల పట్ల నమ్మకం పెరుగుతుందని తెలిపారు. గ్రా మాల్లో పర్యటిస్తూ ప్రజలతో సత్సంబంధాల పెంచు కోవాలని, సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసే విధంగా ప్రజలను ప్రోత్సహించాలని తెలిపారు. రాత్రి సమయాల్లో అద నంగా గస్తీ నిర్వహిస్తూ ఆర్థిక నేరాలను కట్టడి చేసే విధంగా ప్రణాళికను రూపొందించి అవలంభించాలని సూచించారు. సిబ్బంది ఎల్లవేళలా పోలీస్‌స్టేషన్‌లో అం దుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, సీఐలు కరుణాకర్, సునీల్, శ్రీనివాస్, నవీన్, డీఎస్పీ కార్యాలయం సిబ్బంది జైపాల్, రవి, కిష్టయ్య, గణేష్ పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

పరీక్ష కేంద్రాల తనిఖీ

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా శిక్షణ కేంద్రం లో శిక్షణ తీసుకుంటున్న కానిస్టేబుళ్లకు రెండో సెమి స్టర్ చివరి పరీక్షలు ఉన్నందున జిల్లా ఎస్పీగౌస్ ఆలం బుధవారం ఉదయం పరీక్షా కేం ద్రాలను సందర్శించి పరిశీలించారు. 9 నెలల పాటు శిక్ష ణను తీసుకొని చివరి రాత పరీక్షలను రాస్తున్న 254 మం ది శిక్షణ కానిస్టేబుళ్లు, నాలుగు రోజుల పాటు ఈ పరీ క్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. నిజామాబాద్ నుంచి విచ్చేసిన ప్రత్యేక పరీక్షల నిర్వహకులు ఆదిలాబాద్ జిల్లాలోని శిక్షణ కానిస్టేబుళ్లకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ సి.సమయ్ జాన్‌రావ్, నిజామాబాద్ సీటీసీ ఏసీపీ సయ్యద్ మస్తాన్ అలీ, ఆర్ఐ కార్తీక్, ఆర్ఎస్సై రాకేష్, సిబ్బంది పాల్గొన్నారు.

దాబాల్లో ఎక్సైజ్ శాఖ తనిఖీలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


తనిఖీలు చేస్తున్న అధికారులు

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి) : దాబాల్లో ఎక్సైజ్ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆంధ్రజ్యోతి కథనానికి అధికారులు స్పందించారు. ఆదిలాబాద్ జిల్లాలోని పలు దాబా ల్లో అక్రమంగా అనుమతి లేని మద్యం సిట్టింగ్‌ల వల్ల జరిగే అనర్థాలపై 'దాబాలో మద్యం సిట్టింగులు..' అనే శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతి పత్రికలో కథనం ప్రచురితం అయింది. ఈ కథనానికి ఎక్సైజ్ శాఖా ధికారులు స్పందించారు. ఎక్సైజ్ సీఐ విజేందర్ రేండ్ల ఆదేశాల మేరకు ఎక్సైజ్ శాఖాధికారులు, సిబ్బంది ఆదిలాబాద్ పట్టణ శివారులోని పలు దాబాల్లో మద్యం సిట్టింగ్ అనుమతులు లేవని దాబా యజమానులకు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్ప వని పేర్కొన్నారు.

మంచినీటి సరఫరాలో నిర్లక్ష్యం వద్దు : ఈఈ


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ

బోథ్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి సరఫరా విషయం లో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ చంద్రమోహన్ పేర్కొ న్నారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మంచినీటి సరఫరా సహాయకులకు నిర్వహించిన శిక్షణ తరగతులకు హాజరై ప్రసంగిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న మరమ్మతులను తక్షణమే పూర్తిచేయాలని సూచించారు. లీకేజీలను అక్కడికక్కడే పరిష్కరించాలని పేర్కొన్నారు. మోటార్లు చెడిపోయినట్లయితే తక్షణమే మరమ్మతులు చేయించాలని, అందుకు గ్రామాల కార్యదర్శుల దృష్టికి తీసుకురావాలన్నారు. బోరుబావులు అండ్ పంప్‌లు చెడిపోతే తక్షణమే స్పందించాలని మిషన్ భగీరథ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డివిజనల్ ఇంజనీరింగ్ అధికారి ఎన్. వెంకటమోహన్, ఏఈఈ కళ్యాణ్‌చక్రవర్తి, ఎంపీఈవో జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

బోథ్‌లో ఘనంగా బతుకమ్మ పండుగ


దన్నూర్‌లో బతుకమ్మల నిమజ్జనానికి తరలివెళుతున్న మహిళలు


బోథ్‌లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

బోథ్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో బతుకమ్మ పండుగ వేడుకలు జరుగు తున్నాయి. ఒక్కో గ్రామంలో ఒక్క రోజు బతుకమ్మ మంగళవారం రాత్రి నిమ జ్జనానికి బయలుదేరిన బతుకమ్మలు బుధవారం రెండు గంటల ప్రాంతంలో నిమజ్జనం చేశారు. బోథ్, దన్నూర్ గ్రామాల సమీపంలోని వాగులలో నిమజ్జనం చేశారు. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలను తీసుకుని పాటలు కోలాటాలు వేస్తూ తరలివెళ్లారు.

బోథ్ అభివృద్ధికి రూ.10 కోట్ల మంజూరు

బోథ్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి రూ.10 కోట్లు మంత్రి సీతక్క మంజూరు చేసిందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పేర్కొన్నారు. ఏళ్లుగా దన్నూర్ గ్రామ ప్రజలు ఎదురుచూస్తున్న వంతెన నిర్మాణానికి గతంలో మంత్రి ఇచ్చిన హామీ మేరకు మూడు కోట్ల 30 లక్షల రూపాయలు మంజూరు చేసిందన్నారు. మండలంలోని బోర్గం రోడ్డు నిర్మాణానికి కోటి 20 లక్షల రూపాయలు, గుడిహత్నూర్ మండలంలోని కులారి నుంచి ఇన్కర్ గూడకు మీదుగా బీటీ రోడ్డు ఐదు కోట్ల 50 లక్షలు, మంజూరు చేయడం జరిగిందన్నారు.

వ్యాపార సముదాయాల బంద్

- కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి) : వ్యాపార సముదాయాల్లో పనిచేసే కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ కార్మికులు బుధవారం ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్ పట్టణంలో మధ్యాహ్నం రెండు గంటల వరకు వ్యాపార సముదాయాలను బంద్ పాటించారు. చిన్న వ్యాపార సముదాయాలతోపాటు షాపింగ్ మాల్స్, సూపర్ మార్కెట్లు సైతం బంద్ చేపట్టారు. కార్మికులకు చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రేడ్ అసోసియేషన్ మద్దతు తెలిపింది.

కార్మికుల భారీ ర్యాలీ..

కార్మిక శాఖ ద్వారా కార్మికులకు సంక్షేమ కోసం పథకాలను పెంచాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ పట్టణంలో కార్మికులు మహార్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో భారీసంఖ్యలో కార్మికుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ లేబర్ ఆఫీసర్ జగదీష్ రెడ్డి మాట్లాడుతూ 20 ఏళ్ల నుంచి కార్మిక శాఖ ద్వారా ఇచ్చే సంక్షేమ పథకాల్లో ఏ విధమైన వ్యత్యాసం లేదని పేర్కొన్నారు. కార్మికులు సంఘటితమైతేనే హక్కులను సాధించవచ్చని ఆయన అన్నారు.

వందలాది మందితో ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా

దుకాణాల్లో పనిచేసే కార్మికుల సంక్షేమం కోసం ఐక్యంగా ఉండి ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అవసరముందని విశ్రాంత కార్మిక శాఖాధికారి జగదీష్ రెడ్డి అన్నారు. బుధవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ముందుగా పట్టణంలో బంద్ పాటించి నిరసన ర్యాలీ చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి 9 నెలలవుతున్న ఇప్పటి వరకు కార్మికశాఖ మంత్రి లేడన్నారు. పోలీసులు బందోబస్తు చేపట్టారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కాటన్ కమీషన్ ఏజెంట్ వర్కర్స్

భీమ్ విగ్రహావిష్కరణకు గిరిజనులు తరలిరావాలి

ఉట్నూర్, అక్టోబరు 16: గిరిజనుల హక్కుల కోసం పోరాడిన కొమురంభీం విగ్రహావిష్కరణకు గిరిజనులు అధిక సంఖ్యలో తరలి రావాలని తుడందెబ్బ జిల్లా అధ్యక్షుడు పురకబాపురావు,ఆదివాసీ ప్రతినిధులు రామారావు,సంద్రజైవంత్‌రావులు కోరారు. బుధవారం ఐటీడీఏ కార్యాలయం ముందు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 19న మండలంలోని తాటిగూడలో కొమురంభీం నూతన విగ్రహాన్ని ఆవిష్కరించనున్నామని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

